సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 18 । అక్టోబర్ । 2025

గరిష్టం / కనిష్టం
31°/ 22°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వరకు పలుచోట్ల జల్లులు పడవచ్చు.

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



పత్రికా స్వేచ్ఛను హరించొద్దు



పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పాత్రికేయలోకం డిమాండ్ చేసింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కల్తీ మద్యం వ్యవహారంపై సాక్షి పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో సాక్షి యాజమాన్యంతోపాటు సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టింది. సంస్థ కార్యాలయాల్లోకి జొరబడి నిర్బంధ విచారణ సాగిస్తోంది. తరచుగా నోటీసులు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీ సర్కారు తీరును జిల్లాలో శుక్రవారం జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు నిరసించారు. ఆందోళనలు, ప్రదర్శనలు చేపట్టారు. అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందించారు. సాక్షి పత్రికపై ఏపీ ప్రభుత్వం కక్ష గట్టి వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రభుత్వాలకు మనుగడ ఉండదని, తప్పిదాలను ఎత్తి చూపితే సరిచేసుకోవాలేకానీ నేరంగా భావించకూడదని పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్, ఇతర జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

IIలో

న్యూస్‌రీల్

22 నుంచి సామూహిక సత్యనారాయణ వ్రతాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల సందర్భంగా ఈ నెల 22 నుంచి సామూహిక సత్యనారాయణస్వామివారి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.దామోదర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో ప్రతీ శని, ఆది, సోమ వారాల్లో చిత్రకూట మండపంలో వ్రతాలు జరుపుతామని పేర్కొన్నారు. వ్రతాల్లో పాల్గొనే భక్తులు ఆయా రోజుల్లో ఉదయం 8 గంటల లోపు దేవస్థాన కౌంటర్‌లో టికెట్ తీసుకోవాలని, టికెట్ ధర రూ.516గా నిర్ణయించామని తెలిపారు. వ్రతానికి కావలసిన సామగ్రితోపాటు భక్తులకు భోజనసౌకర్యం దేవస్థానం ఏర్పాటు చేస్తుందని వివరించారు.

తగిన జాగ్రత్తలతో కంటికి రక్షణ

ఎస్పీ రోహిత్‌రాజు



కంటి పరీక్ష చేయించుకుంటున్న ఎస్పీ

కొత్తగూడెంటౌన్: ప్రతి ఒక్కరూ కంటి చూపు విషయంలో జాగ్రత్తలు పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెల్‌ఫోన్ల వినియోగం పెరగడంతో కంటి సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయని తెలిపారు. ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఆర్‌ఐలు సుధాకర్, నరసింహారావు, కృష్ణారావు, లాల్‌బాబు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఐపీ పోర్టల్‌పై అవగాహన

చుంచుపల్లి: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబోరేటరీల ప్రతినిధులకు ఐహెచ్‌ఐపీ ఆన్‌లైన్ పోర్టల్‌పై శుక్రవారం కొత్తగూడెం శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్ జయలక్ష్మి మాట్లాడుతూ ఎల్, పీ ఫారాల వివరాలను రోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కేసులు లేకపోతే నిల్ రిపోర్ట్‌ను సమర్పించాలని సూచించారు. డాక్టర్లు సైదులు, పుల్లారెడ్డి, సిబ్బంది ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు సీపీఎం మద్దతు

ఇల్లెందు: రాష్ట్రంలో బీసీ సంఘాలు, కులాలు, రాజకీయ పార్టీలు శనివారం నిర్వహించే బీసీ బంద్‌కు సీపీఎం సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ తెలిపారు. శుక్రవారం ఇల్లెందులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ సాధనకు కలిసి వచ్చే పార్టీలు, సంఘాలతో కలిసి పోరాడుతామని అన్నారు. కానీ రిజర్వేషన్‌ను అడ్డుకున్న బీజేపీతో కలిసి పోరాడటం అసాధ్యమని పేర్కొన్నారు. ముమ్మాటికీ బీసీ రిజర్వేషన్‌లు అడ్డుకుంటున్నది మాత్రం బీజేపీయేనని విమర్శించారు. శనివారం జరిగే బంద్‌లో సీపీఎంతో పాటు ప్రజా సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు అన్నవరపు కనకయ్య, సత్యనారాయణ, ఏజే రమేష్, అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, బ్రహ్మచారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ సాలోమాన్

చుంచుపల్లి: అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పి.సాలోమాన్ అన్నారు. శుక్రవారం ఆయన కొత్తగూడెం డిపోను సందర్శించారు. గ్యారేజీ, పోలీస్ సెక్యూరిటీ విభాగం, ట్రాఫిక్ సెక్షన్లను తనిఖీ చేశారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని డిపోలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్, అధికారులు మల్లయ్య, యు.రాజ్యలక్ష్మి, కె.శరత్ చంద్ర, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికలో మార్పులు!

వైదిక కమిటీ సభ్యుల సూచనలకు మాస్టర్ ప్లాన్‌లో చోటు

- మరోసారి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్న ఆర్కిటెక్ట్
- భద్రాచలం రామాలయ అభివృద్ధిలో జాప్యంపై భక్తుల అసహనం



భద్రాచలం దేవస్థానం

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అభివృద్ధి మాస్టర్ ప్లాన్ ఇంకా కొలిక్కి రాలేదు. ఆర్కిటెక్ట్ భద్రాచలంలో రెండుసార్లు పర్యటించినా తుది ప్లాన్‌పై స్పష్టత రాలేదు. వైదిక సభ్యులు, అర్చకుల సలహాలు, సూచనలతో ప్రణాళికలో మళ్లీ మార్పులు చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయ అభివృద్ధిని ప్రకటించి రెండేళ్లయినా ప్లాన్ తుదిరూపం దాల్చలేదు. దీంతో భక్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సూచనల ఆధారంగా ప్లాన్‌లో మార్పులు

తొలుత కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి దేవాదాయ శాఖ ,అధికారులతో కలిసి భద్రాచలంలో పర్యటించారు. ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రణాళిక రూపొందించారు. గత నెల 25న రెండోసారి వచ్చిన ఆర్కిటెక్ట్ వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు, పండితులతో చిత్రకూట మండపంలో సమావేశమయ్యారు. ప్లాన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం వైదిక కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. మూలమూర్తుల గోపురం మినహా, ఉపాలయాల విస్తరణ చేపట్టాలని, ఇవన్నీ మరో ప్రాకార మండపంలో ఉండేలా రాతి కట్టడాలతో అన్ని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. యాగశాలను పునర్నిర్మించాలని, భవిష్యత్ పూజలకు తగినట్లు ఆలయం చుట్టూ వీధులను విస్తరించి స్వామివారి రథం తిరిగే విధంగా చూడాలన్నారు. సూచనలు ఆధారంగా మార్పులు చేపట్టి ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి మరోసారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

రూ.350 కోట్ల బడ్జెట్‌లోనే అభివృద్ధి పనులు..

రామాలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ రూ. 350 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించింది. తొలుత ఆలయ కాంప్లెక్ విస్తరణ చేపట్టాలని, మండపాలు, క్యూ హాల్స్, ప్రసాదం విభాగం, అడ్మినిస్ట్రేషన్ భవనాల నిర్మాణానికి రూ. 115 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. రెండో భాగంలో ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను పేర్కొంటూ విస్తా కాంప్లెక్స్, అడ్మిన్ బ్లాక్, ఘాట్లు, రహదారుల నిర్మాణానికి రూ. 35 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. మూడో భాగంలో దేవస్థానం స్వాధీనం చేసుకున్న కాపా రామలక్ష్మమ్మ ఖాళీ స్థలంలో రామాయణ మ్యూజియం, తూము నర్సింహాదాసు ఆడిటోరియం, భక్త రామదాసు ప్లాజా, మల్టీ లెవల్ పార్కింగ్‌లకు రూ. 100 కోట్లతో ప్రణాళికలు చేపట్టారు. నాలుగ భాగంగా పట్టణ సుందీకరణ, హోటళ్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ. 100 కోట్లను కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించారు.

వేములవాడ రాజన్నకు దక్కిన గౌరవం రామయ్యకు దక్కదా?

రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలంతోపాటు వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రణాళిక ప్రకటించటంతోపాటు రూ. 100 కోట్లను విడుదల చేసింది. ఆలయ అభివృద్ధి పనులు చేపట్టింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సైతం నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. కానీ వీటితో పాటు ప్రకటించిన భద్రగిరి రామయ్య దేవస్థానం ప్లాన్ మాత్రం ముందుకు సాగటం లేదు. మార్పులు, చేర్పుల వద్దనే ఆగిపోయింది. ప్లాన్‌పై తొలుత వైదిక సభ్యుల ఆమోదం , అనంతరం కలెక్టర్, ఆ తర్వాత దేవాదాయ శాఖ ద్వారా ప్రభుత్వానికి చేరాల్సి ఉంది. ఇందుకు ఎంత సమయం పడుతుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వమే ఫైనలైజ్ చేయాలి



భద్రాచలం దేవస్థాన అభివృద్ధి ప్లాన్‌ను ప్రభుత్వం తొలుత ఫైనలైజ్ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కాలాయాపన చేస్తూ అభివృద్ధిని పక్కదారి పట్టిస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధికి నిధులు విడుదల చేస్తామని భద్రాచలంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలి.

– ఆకోజు సునీల్, బీఆర్‌ఎస్ నాయకుడు

నాణ్యమైన మొక్కలు అందించాలి



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వేదికపై ఎమ్మెల్యేలు ఆదినారాయణ, రాగమయి

- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆయిల్‌పామ్ గింజలు నాటిన మంత్రి

అశ్వారావుపేట: తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలను రైతులకు అందజేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నారంవారిగూడెం ఆయిల్‌పామ్ నర్సరీలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. మొక్కల పెంపకానికి ఆధునిక పద్ధతుల్లో పొట్టి రకం ఆయిల్‌పామ్ గింజలను నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్‌కు వచ్చే తెగులు గానోడెర్మా, నివారణ మందు వామ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్రంలో 40లక్షల ఎకరాల్లో పత్తి నాటినా వర్షాల కారణంగా కాత లేక రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు. మొక్కజొన్నదీ అదే పరిస్థితి అని అన్నారు. ఆయిల్ పామ్ ఒక్కటే రైతులు నష్టపోకుండా లాభాల బాటన ఉంచుతుందన్నారు. 2019–20లో కరోనా సమయంలో కొందరు బ్రోకర్లు తోటల్లో రాలిన గింజలను బ్యాగులలో పెట్టి మొక్కలుగా పెంచి రైతులకు అంటగట్టినట్లు తెలుస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాకో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని, మరో రెండేళ్ల వరకు కొత్త ఫ్యాక్టరీ కట్టకున్నా ఉన్న ఫ్యాక్టరీలతో క్రషింగ్ చేయవచ్చని వివరించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఉద్యాన పంటలపై పరిశోధనలు జరపాలన్నారు. సాగు పద్ధతుల అధ్యయనానికి రైతులను, విద్యార్థులను మలేషియా తీసుకెళ్లేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మట్టా రాగమయి దయానంద్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, ఎండీ శంకరయ్య, ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కట్టడిలో ముందంజ



'చైతన్యం' కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు, అధికారులు(ఫైల్)



అశ్వారావుపేటలో ఇటీవల స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

- సీజ్‌తోపాటు కేసుల నమోదులో జిల్లాకు ప్రథమ స్థానం
- పోలీసు తనిఖీలతో తగ్గుముఖం పట్టిన రవాణా
- ప్రజల్లో అవగాహనకు 'చైతన్యం' పేరిట సదస్సులు

కొత్తగూడెంటౌన్: గంజాయి రవాణాను సమర్థవంతంగా అరికట్టడంతోపాటు కొనుగోలు, అమ్మకదారులపై పీడీ యాక్ట్ అమలు చేస్తున్నారు. అంతేకాక నిందితుల ఆస్తులను కూడా స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కేసుల నమోదు, గంజాయిని సీజ్ చేయడంలో దేశంలోనే భద్రాద్రి జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. పోలీసుల విస్తృత తనిఖీలతో గతంతో పోలిస్తే జిల్లా మీదుగా గంజాయి రవాణా తగ్గుముఖం పట్టిందని చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే గంజాయిని పూర్తిగా నిర్మూలించేలా 'చైతన్యం' పేరుతో పోలీసు శాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది.

గత ఏడాది 88 కేసులు

జిల్లావ్యాప్తంగా 2024లో గంజాయి రవాణాకు సంబంధించి 88 కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రూ.19.46 కోట్ల విలువైన 7,787.712 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 445 మందిపై కేసు నమోదు చేసి 236 మందిని అరెస్టు చేశారు. ఇక ఈ ఏడాది అక్టోబర్ 13వ తేదీ వరకు 59 కేసుల్లో రూ.25.89 కోట్ల విలువైన 5200 కేజీల గంజాయి సీజ్ చేయగా, 189 మందిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలోనే గంజాయి రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేలా పోలీసుశాఖ ఈనెల 15 నుంచి నవంబర్ 15 వరకు 'చైతన్యం' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించి గంజాయి మహమ్మారిని తరిమికొట్టడం ద్వారా గంజాయి రహిత జిల్లాగా మారుస్తామని ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడించారు. ఇప్పటికే ఏఓబీ నుంచి జిల్లా మీదుగా గంజాయి రవాణాను కట్టడి చేయగా.. వినియోగాన్ని సైతం నిర్మూలించేలా పోలీసులు కృషి చేస్తున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు.

గంజాయికి అడ్డుకట్ట..

చెక్‌పోస్టుల వద్ద నిఘాపెంచారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ప్రత్యేక శిక్షణ ఇప్పించిన జాగిలాలతో తనిఖీలు చేడుతున్నారు. ఇలాంటి చర్యలతో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కేసులు తగ్గాయి.

దేశంలోనే ప్రథమస్థానం



జిల్లాను గంజాయి రహితంగా మార్చడమే ధ్యేయం. ఈ ఏడాది ఇప్పటివరకు 59 కేసులు నమోదు కాగా రూ.25.89 కోట్ల విలువైన దాదాపు 5,200 కేజీల గంజాయి సీజ్ చేశాం. ప్రజల్లో మరింత చైతన్యం నింపి రవాణాదారుల సమాచారం ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. ఎవరూ అమ్మకుండా, వినియోగించకుండా తనిఖీలు ముమ్మరం చేశాం. గంజాయి రవాణా చేసినా, వినియోగించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. కేసుల నమోదులో దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్నాం.– బి.రోహిత్‌రాజు, ఎస్పీ

ఒక్కరోజే గడువు



ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయం ఎదుట దరఖాస్తుదారుల సందడి

- నేటితో ముగియనున్న మద్యం టెండర్లు
- ఇప్పటివరకు 1,959 దరఖాస్తులు..
- ఎక్సైజ్ శాఖకు రూ.58.77 కోట్ల రాబడి

పాల్వంచరూరల్: నేటితో మద్యం టెండర్ల దరఖాస్తుల గడువు ముగియనుంది. జిల్లాలో 88 మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తూ గత నెల 26న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. రిజర్వేషన్ల వారీగా ఎస్సీ కేటగిరీకి 7, ఎస్టీలకు 44, గౌడ సామాజిక వర్గానికి 6, జనరల్ కేటగిరీకి 31 కేటాయించి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈసారి మద్యం దుకాణాలకు ఆశించినస్థాయిలో దరఖాస్తులు రావడంలేదు. 2023లో 88 మద్యం దుకాణాలకు టెండర్లు స్వీకరించగా 5,057 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖకు రూ.101 కోట్ల ఆదాయం లభించింది. ఈసారి కూడా భారీగా ఆదాయం వస్తుందని ఎక్సైజ్ శాఖ ఆశించింది. శుక్రవారం వరకు 1,959 దరఖాస్తులు రాగా, ఆదాయం రూ.58.77 కోట్లు లభించింది. శుక్రవారం ఒక్క రోజే 1,149 దరఖాస్తులు వచ్చాయి.

23న మద్యం దుకాణాలకు లాటరీ



జిల్లాలో నూతన మద్యం దుకాణాల లైసెన్స్‌కోసం శుక్రవారం వరకు 1,959 దరఖాస్తులు వచ్చాయి. శనివారం దరఖాస్తులకు చివరి రోజు కావడంతో ఎక్కువ మంది దరఖాస్తు చేస్తారని ఆశిస్తున్నాం. ఈ నెల 23న కొత్తగూడెం క్లబ్‌లో లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయిస్తాం.

–జానయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

డిపాజిట్ పెంపుతో తగ్గిన దరఖాస్తులు

గతంలో మద్యం టెండర్ల దాఖలుకు రుసుం రూ.2 లక్షలు ఉండగా, ఈసారి రూ. 3 లక్షలకు పెంచారు. దీంతో దరఖాస్తుల సంఖ్య తగ్గింది. కనీసం రెండేళ్ల క్రితం వచ్చిన రూ.101 కోట్ల ఆదాయం రావాలన్నా, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులకు రెట్టింపు సంఖ్యలో టెండర్లు దాఖలు చేయాలి. కానీ మిగిలిన ఒక్క రోజులో అన్ని దరఖాస్తులు వచ్చే పరిస్థితి కన్పించడంలేదు.

ఒకే రోజు 1,149 దరఖాస్తులు

కొత్తగూడెంఅర్బన్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తోంది. శనివారంతో గడువు ముగియనుండగా శుక్రవారం జిల్లాలోని ఆరు స్టేషన్ల పరిధిలో అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దీంతో కొత్తగూడెంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం సందడిగా మారింది. సాయంత్రం 5 గంటల వరకు క్యూలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి, రాత్రి వరకు దరఖాస్తులు తీసుకున్నారు. ఇప్పటివరకు 1,959 దరఖాస్తులు రాగా, శుక్రవారం ఒక్కరోజే 1,149 దరఖాస్తులు వచ్చాయి. శనివారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో డీడీల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

'సూపర్ స్పెషాలిటీ' వచ్చేనా..?

- సింగరేణి ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల కొరత
- అత్యవసర కేసులు హైదరాబాద్ ఆస్పత్రులకు రిఫర్
- ఎంఆర్‌ఐ స్కానింగ్, థైరాయిడ్ టెస్ట్ ప్రైవేటులోనే..
- కార్మికులకు అందని సూపర్ స్పెషాలిటీ వైద్యం



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రి

కొత్తగూడెంఅర్బన్: బొగ్గు ఉత్పత్తికి అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల ఆరోగ్యంపై సింగరేణి యాజమాన్యం శ్రద్ధ చూపడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర కేసులను కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రుల నుంచి హైదరాబాద్‌లోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఈ క్రమంలో సింగరేణి ఆధ్వర్యంలోనే సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఇటీవల సంస్థ సీఎండీ బలరాం నాయక్ నిర్ణయించారు. హైదరాబాద్‌లో 200 పడకల ఆస్పత్రికి సరిపడేలా భవనం లీజుకు తీసుకోవాలని, లేకపోతే కొనుగోలు చేసి ఆస్పత్రిని నిర్వహించాలని భావించారు. ఆ తర్వాత ఆస్పత్రి ఏర్పాటుకు ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారనేది స్పష్టతలేదు.

కార్మిక కుటుంబాల అవస్థ

సింగరేణిలో సుమారు 42 వేల మంది ఎన్సీడబ్ల్యూఏ కార్మికులు, 50 వేల మంది రిటైర్డ్ కార్మికులు, 2,500 మంది అధికారులు, 34 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. కొత్తగూడెంలో ప్రధాన ఆస్పత్రితోపాటు బెల్లంపల్లి, గోదావరిఖని, భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి, ఇల్లెందు, మణుగూరు ప్రాంతాల్లో ఏరియా ఆస్పత్రులున్నాయి. వీటి పరిధిలో డిస్పెన్సరీలు నడుస్తున్నాయి. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రతీసారి డిస్పెన్సరీ నుంచి రిఫరెన్స్ రాయించుకుని వస్తేనే ఏరియా ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో ఆస్పత్రికి రాలేక కార్మిక కుటుంబాలు అవస్థ పడుతున్నాయి. ప్రతినెలా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నా ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సి వస్తోందని కార్మికులు పేర్కొంటున్నారు.

వైద్య నిపుణుల కొరత

కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రితో పాటు, ఇల్లెందు, మణుగూరు ఏరియా ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యులు లేరు. సింగరేణి కార్మికులకు ఎక్కువగా న్యూరాలజీ, కార్డియో సమస్యలు వస్తుంటాయి. ఈ విభాగాల్లో స్పెషలిస్టులు లేకపోవడంతో హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లోని ఆస్పత్రులకు ఎక్కువగా రిఫర్ చేస్తున్నారు. థైరాయిడ్ పరీక్షలు, ఎంఆర్‌ఐ స్కానింగ్ సౌకర్యాలు లేకపోవడంతో ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తోంది. మందుల కోసం కూడా ఒక పూట వేచి చూస్తున్నామని, సిటి స్కానింగ్ రిపోర్టులు మూడు రోజుల తర్వాత ఇస్తున్నారని కార్మికులు చెబుతున్నారు. మణుగూరు ఆస్పత్రిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మణుగూరులోని ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్టులేక ఇటీవల గర్భంలోనే ఓ శిశువు మృతి చెందింది. కొత్తగూడెం ప్రధానాస్పత్రికి తీసుకొచ్చినా అప్పటికే ఆలస్యమైంది. ఫలితంగా కార్మికులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి త్వరితగతిన ఏర్పాటు చేయాలని, అది కూడా హైదరాబాద్‌లో కాకుండా సింగరేణి విస్తరించి ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఆస్పత్రుల సమస్యలపై ఫోన్‌లో సింగరేణి ప్రధాన ఆస్పత్రి సీఎంఓ కిరణ్‌రాజ్‌ను వివరణ కోరే ప్రయత్నం చేయగా.. ఆయన స్పందించలేదు.

క్రీడా ప్రతిభ చాటాలి



క్రీడాకారులతో ఐటీడీఏ పీఓ రాహుల్, అధికారులు

దుమ్ముగూడెం : విద్యార్థులు క్రీడా ప్రతిభ చాటాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఆర్లగూడెం గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో డివిజన్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గిరిజన విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి టెన్నికాయిట్, వాలీబాల్ క్రీడలు ఆడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. అధికారులు అశోక్, సోమశేఖర్, నరసింహారావు, శ్రీనివాసరావు, వసంత్, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, జయ, వెంకటేశ్వర్లు, బాబూరావు, పార్వతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

బూర్గంపాడు: కృష్ణసాగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. గురువారం ప్రిన్సిపాల్ మెండెం దేవదాస్, అధ్యాపకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అండర్–19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు శ్యాంప్రసాద్, ఎం.జనార్దన్, నవదీప్, హాకీలో కృష్ణప్రసాద్, తులసీరామ్, భరత్, పార్థివే, రామ్‌చరణ్.. టేబుల్ టెన్నిస్‌కు శేషంత్ ఎంపికైనట్లు అధ్యాపకులు తెలిపారు.

విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రపతి నిలయం ప్రతినిధి నుంచి పురస్కారం అందుకుంటున్న ఎంఈఓ ఆనంద్‌కుమార్

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఇటీవల నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. రాష్ట్రపతి నిలయం ప్రతినిధుల నుంచి పురస్కారం అందుకున్నారు. మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులను అభినందించారు.

బెల్టు దుకాణాలపై దాడి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ ఆధ్వర్యంలో టౌన్ సీఐ నాగరాజు, ఎస్‌ఐలు సతీశ్, రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్‌ఐ తిరుపతి బెల్ట్ దుకాణాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. మద్యం బాటిళ్లు, గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పట్టణంలోని అన్ని బెల్ట్, పాన్ దుకాణాల్లో నిత్యం తనిఖీలు నిర్వహిస్తామని, ఏజెన్సీ ప్రాంతం కావడంతో మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు పెరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆపరేషన్ 'చైతన్య' పేరుతో ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి హాట్‌స్పాట్‌లలో నిత్యం తనిఖీలు ఉంటాయని పేర్కొన్నారు.

8 మందికి ఏడేళ్ల జైలు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామానికి చెందిన గూడూరు మల్లారెడ్డి ఆత్మహత్య చేసుకున్న కేసులో ఎనిమిది మందికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.కిరణ్‌కుమార్ తీర్పు ఇచ్చారు. మృతుడి కుమారుడు శ్రీనివాసరెడ్డి మొండికుంటలో వారసత్వ భూమి రెండు ఎకరాలను తన తండ్రి మల్లారెడ్డిని బెదిరించి గ్రామానికి చెందిన మేడవరపు మంగపతిరావు, సుధీర్, సురేశ్, పర్వత నరేశ్, తుక్కాని రామిరెడ్డి, కాసరబాద సత్యం, రాములు, సందీప్, గూడురు జనార్దన్ రెడ్డి ఆక్రమించుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేశారు. కాగా, ఎవరూ పట్టించుకోలేదని 2021 మార్చి 3న తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 12 మంది సాక్షులను విచారించారు. కేసు విచారణలో ఉండగా కాసరబాద సత్యం మృతి చెందాడు. విచారణ అనంతరం ఎనిమిది మందిపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికీ ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అదనపు పీపీ కారం రాజారావు వాదించగా.. కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్‌ఐ డి.రాఘవయ్య, లైజన్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్,పీసీ.ఈశ్వరరావు సహకరించారు.

అర్హులైన వారికే అధ్యక్ష పదవి



మాట్లాడుతున్న జాన్సన్ అబ్రహం

భద్రాచలంటౌన్: పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ.. కష్టకాలంలోనూ పార్టీలో ఉన్న వారికి వ్యక్తిగత ఇంటర్వ్యూ నిర్వహించి, పదవి ఇస్తామని జిల్లా ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహం తెలిపారు. భద్రాచలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్ష పదవికి అర్హులైన అభ్యర్థులకు శుక్రవారం వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేశారు. దేశవ్యాప్తంగా పార్టీ పునర్నిర్మాణంతోపాటు బలోపేతం కోసం ‘సంఘటన్ సృజన్ అభియాన్’ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, జిల్లా కాంగ్రెస్ కమిటీలను బలపరచడం, బాధ్యతాయుతమైన, ప్రజలకు చేరువైన పార్టీ నిర్మాణాన్ని సృష్టించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, జిల్లా, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,400

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు



భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

- అక్రమ కేసులు, అణచివేతలు మానాలి
- సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
- జర్నలిస్టులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన
- కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందులో ఆందోళన

కొత్తగూడెంఅర్బన్: నిజాలు వెలికితీసే పత్రికలపై అక్రమ కేసులు, అణచివేతలు మానాలని జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం, ఆపై విచారణ పేరుతో నిర్బంధ కాండ విధించడం సరికాదని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని విమర్శించారు. సాక్షి యాజమాన్యం, జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం కక్ష గట్టి వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ శుక్రవారం జిల్లాలో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఏపీ ప్రభుత్వ తీరును ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పత్రికలు, చానళ్లపై కేసులు పెట్టడమంటే రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు చేస్తున్న తప్పిదాలను ఎత్తి చూపడమే మీడియా బాధ్యతని గుర్తుచేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మీడియా ప్రజా సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతుందని, అవినీతిని వెలికి తీస్తుందని అన్నారు. సాక్షి పత్రిక ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని, సాక్షి కార్యాలయాలపై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు జునుమాల రమేష్, కె.శ్రీనివాస్, మొటమర్రి రామకృష్ణ, సీమకుర్తి రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్, ఆదాబ్ శ్రీనివాస్, అశోక్, కొండ జంపన్న, దశరథ్, రవి, రాందాస్, ప్రవీణ్, ఈశ్వర్, సైదులు, సురేందర్, వాసాల చంద్రశేఖర్, జి.కృష్ణారావు, పి.రాము, ఆర్.సంజీవ్, గగనం శ్రీనివాస్, ఏ.రాజశేఖర్, వి.పూర్ణచందర్‌రావు, సాయిప్రసాద్‌రెడ్డి, దారా శ్రీనివాస్, తాళ్లూరి నరేష్‌దాస్, పార్టీలు, సంఘాల నాయకులు కంచర్ల జమలయ్య, గౌని నాగేశ్వరరావు, కోటా శివశంకర్, తాండ్ర వెంకటేశ్వర్లు, అడ్వకేట్ అనుదీప్, రాకేష్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అణచివేత ధోరణి సరికాదు



ఏపీ ప్రభుత్వం మీడియాపై అణచివేత ధోరణి అవలంబిస్తోంది. కలానికి సంకెళ్లు వేసే ప్రయత్నాలను విరమించుకోవాలి. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి. ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధిగా ఉండే పత్రికల స్వేచ్ఛను హరించొద్దు.

–గౌని నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి

భయభ్రాంతులకు గురిచేయొద్దు



ఏపీ ప్రభుత్వం సాక్షి పత్రిక, సంస్థలో పని చేసే జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు చేపట్టడం సరికాదు. జర్నలిస్టులపై కేసులు పెట్టడమంటే పత్రికా స్వేచ్ఛను హరించివేయడమే. ఇటువంటి చర్యలు మానుకోవాలి.

–కంచర్ల జమలయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి

రాజ్యాంగ విరుద్ధ చర్యలు



ప్రభుత్వం తప్పుడు దారిలో వెళ్తుంటే ప్రశ్నించే స్వేచ్ఛ పత్రికలకు ఉంటుంది. ఆ దిశగా కథనాలు రాసిన వారిని టార్గెట్ చేసి కేసులు పెట్టడం, నిర్బంధ విచారణ సాగించడం రాజ్యాంగ విరుద్ధ చర్యలే. ఇకనైనా ఏపీ ప్రభుత్వం తీరు మారాలి.

–తాండ్ర వెంకటేశ్వర్లు, బహుజన సంఘాల ఐక్య వేదిక కన్వీనర్.

మనుగడ ఉండదు



పత్రికా స్వేచ్ఛను హరించిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేదు. భవిష్యత్‌లో కూడా సాధించలేవు. ప్రభుత్వాల వైఫల్యాలను ఎత్తి చూపితే కేసులు నమోదు చేయడం సరికాదు. ఏపీ ప్రభుత్వం అక్రమ కేసులను ఎత్తివేయాలి.

–మొటమర్రి రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు

తప్పిదాలు సరిచేసుకోవాలి



ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపి కథనాలు రాస్తే నేరంగా భావించడం సరికాదు. తప్పిదాలను సరిచేసుకుని ప్రజలకు మేలైన పాలన అందించాలి. అక్రమ కేసులు ఎత్తి వేసి, నిర్బంధ విచారణలు నిలిపివేయాలి.

–జునుమాల రమేష్, సీనియర్ జర్నలిస్టు

'సాక్షి'పై వేధింపులు ఆపాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న జర్నలిస్టులు

ఇల్లెందు: సాక్షి పత్రికపై ఏపీ ప్రభుత్వ వేధింపుల ఆపాలని కోరుతూ జర్నలిస్టులు నిరసన తెలిపారు. శుక్రవారం జేకే సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(టీజేఎఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యులు గుర్రం రాజేష్ మాట్లాడుతూ ఏడాది కాలంగా ఏపీ ప్రభుత్వం సాక్షి పత్రిక, జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తోందని, వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. సాక్షి కార్యాలయాల్లో సోదాలు చేయటం, కేసులు బనాయించటం పత్రికా స్వేచ్ఛను హరించటమే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఇల్లెందుల నాగేశ్వరరావు, శ్రావణ్‌కుమార్ రెడ్డి, ఎండీ యాకూబ్‌పాషా, వేముల రాజు, గుడివాడ శ్రీనివాస్, మధు, బత్తుల కృష్ణ, రమణ, ఎస్ఎల్ ముత్యం, డానియేల్, వీరన్న, శివ, కిరణ్, కుమార్, యూనస్, రాజు, ఏఎస్‌రావు, నటరాజ్, విజ్ఞాన్, శేషు, ప్రసాద్, మహేష్, భాస్కర్, కిరణ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కులను కాపాడాలి



సబ్ కలెక్టర్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం జర్నలిస్ట్ సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జర్నలిస్టుల హక్కులను కాపాడాలని నినదించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం భద్రాచలం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బీవీ రమణా రెడ్డి, జిల్లా కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై వేధింపులకు పాల్పడటం సరికాదని అన్నారు. ప్రతికా కార్యాలయాల్లోకి జొరబడి దౌర్జన్యం చేయడాన్ని పాత్రికేయలోకమంతా ఖండిస్తోందని తెలిపారు. ఎడిటర్‌పై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్‌కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో కృష్ణగోవింద్‌తో పాటు జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దుద్దుకూరి జ్ఞానేందర్, సత్యానంద్, దిలీప్, దుర్గాప్రసాద్‌రెడ్డి, బొల్లె రాంబాబు, విజయ్, రంజిత్, బండారి మహేష్, కాటా సత్యం, మురళి, రవికుమార్, సాయి కౌశిక్, ఈశ్వర్, వెంకటరామిరెడ్డి, ప్రసాద్ యాదవ్, ప్రేమ్, నాగేశ్వరరావు, జగన్, ప్రదీప్, శివగౌడ్, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, నాయకులు

అశ్వారావుపేట: ఏపీ ప్రభుత్వం ‘సాక్షి’ పత్రికపై అవలంబిస్తున్న అణచివేత వైఖరికి నిరసనగా శుక్రవారం అశ్వారావుపేటలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్, తెలంగాణ తల్లి, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు. అశ్వారావుపేటలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు యూఎస్ ప్రకాశరావు, ఎండీ ముబాకర్ బాబా, తాళం సూరి, మోటూరి మోహన్, సత్యవరపు సంపూర్ణ, దండాబత్తుల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రాలీలు ఢీ.. ఒకరి మృతి



నాగరాజు (ఫైల్)

టేకులపల్లి: రెండు ట్రాలీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. టేకులపల్లి రామాలయం సెంటర్‌కు చెందిన జినక నాగరాజు (38) బొలెరో ట్రాలీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలోనే శుక్రవారం రాత్రి బేతంపూడి స్టేజీ నుంచి ఇంటికి వస్తుండగా గోలియాతండా సేవాలాల్ గుడి సమీపాన సంచార చేపల విక్రయ ట్రాలీ వాహనం ఎదురెదురుగా వేగంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బొలెరో ముందు భాగం నుజ్జునుజ్జు కాగా నాగరాజు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, చేపల వాహనం బోల్తా పడగా గాయపడిన డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో సీఐ బత్తుల సత్యనారాయణ, సిబ్బందితో వెళ్లి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

22న దాతలకు సన్మానం

భద్రాచలంటౌన్: రామాలయ అభివృద్ధికి పలు రూపాల్లో సహాయ సహకారాలు అందించిన దాతలను ఈ నెల 22న సత్కరించనున్నామని ఈఓ కె.దామోదర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానానికి రూ.లక్ష పైన అందించిన దాతలను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామని, తానీషా కల్యాణమండపం వెనుక ఉన్న మారుతీ సదనంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే దాతలకు అల్పాహారం, భోజన వసతి కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

ఇందిరమ్మ ఇంటి గోడల కూల్చివేత



ఇంటి గోడ కూల్చుతున్న కాంతమ్మ

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం తనకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ఓ కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించడంపై నిరసనగా లబ్ధిదారురాలు గునపంతో కూల్చివేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని వేదాంతపురం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ దాది కాంతమ్మకు తొలి విడతలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరైంది. ఈ ఇంటి నిర్మాణాన్ని ఓ కాంట్రాక్టర్ నిర్మించేందుకు ముందుకు రావడంతో ఒప్పందం చేసుకొని అప్పగించింది. ఇంటి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నిర్మించడంతో కొద్ది రోజుల క్రితం బాధితురాలు ఇంటి నిర్మాణాన్ని నిలిపి వేసింది. ఆ తర్వాత ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతోపాటు ఇటీవల మండలంలో పర్యటించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని శుక్రవారం బాధితురాలు గునపంతో ఇంటి గోడలను తొలగించింది. దీనిపై హౌసింగ్ ఏఈ మదన్‌కుమార్‌ను వివరణ కోరగా.. విషయం తన దృష్టికి వచ్చిందని, బాధితురాలితో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మజ్జారు కొత్తపల్లి అడవుల నుంచి చర్ల మండలానికి తరలిస్తున్న టేకు కలపను శుక్రవారం తెల్లవారుజామున అటవీశాఖ ఉద్యోగులు పట్టుకున్నారు. మజ్జారు కొత్తపల్లి అడవుల నుంచి వద్దిపేట మీదుగా కలప గోదావరి దాటిస్తున్నట్లు సమాచారం అందడంతో వద్దిపేట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేశ్, బీట్ ఆఫీసర్ బాలాజీ, సిబ్బంది గురువారం అర్ధరాత్రి మాటు వేశారు. ఒక ట్రాక్టర్ ముందు, వెనుక భాగంలో భారీ సైజు ఉన్న రూ.2లక్షల విలువైన 11 టేకు దుంగలను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మణుగూరురూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. మండలంలోని అనంతారం నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసులు నమోదు చేశారు.

రోడ్డుప్రమాదంలో పలువురికి గాయాలు

గుండాల: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ప్రకాష్ భార్య, ఇద్దరు పిల్లలతో ద్విచక్ర వాహనంపై పస్రా వెళ్తున్నాడు. దేవళ్లగూడెం – లింగాల మధ్య మూలమలుపులో ఎదురుగా వస్తున్న ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ప్రకాష్, కుమారులు రుత్విక్, ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రకాశ్ భార్య జ్యోతికి స్వల్ప గాయాలు కాగా, గుండాల ఆస్పత్రికి.. ఆపై ఖమ్మం తరలించారు.

మక్కల కొనుగోళ్లకు కసరత్తు

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: జిల్లాలో ఉన్న 21 పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం, దిగుబడి ఆధారంగా 23 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్‌కు ప్రతిపాదన పంపినట్లు జిల్లా సహకార శాఖ అధికారి అవధాని శ్రీనివాస్ తెలిపారు. ఈ నెలాఖరు నాటికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, వారం రోజుల్లో దీనికి సంబంధించి మార్క్‌ఫెడ్ నుంచి పూర్తిస్థాయి అనుమతులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. మొక్కజొన్న కొనుగోళ్లపై ‘మక్కలు కొంటారా.. కొనరా.. ?’ శీర్షికతో ఈ నెల 14న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంతో అధికారుల్లో కదలిక వచ్చింది. జిల్లాలో లక్ష ఎకరాల్లో సాగైన మొక్కజొన్న ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. యంత్రాల సహాయంతో కంకి నుంచి గింజ వేరు చేసిన రైతులు వాతావరణ అననుకూల పరిస్థితుల కారణంగా దిగుబడి భారీగా తగ్గడంతో నిరాశకు గురయ్యారు. గతేడాది క్వింటాకు మద్దతు ధర రూ.2,225 ఉండగా ప్రస్తుత సీజన్‌లో రూ.2,400గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. దిగుబడి తగ్గినా మద్దతు ధర పెరగడంతో రైతులు కొంత ఊరట చెందారు. కానీ, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో స్థానిక వ్యాపారులు క్వింటా మొక్కజొన్న రూ.1,600కు కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతుల్లో ఆందోళన ప్రారంభమైంది.

టెస్టుల పేరుతో బయటకు పంపొద్దు..

- ప్రభుత్వ వైద్యశాలలోనే చేయాలి..
- అదనపు డీఎంహెచ్ఓ సైదులు



ప్రైవేట్ వైద్యశాలను తనిఖీ చేస్తున్న సైదులు

చర్ల: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులను టెస్టుల పేరుతో బయటి ల్యాబ్‌లకు పంపించొద్దని, ప్రతీ పరీక్ష ప్రభుత్వ వైద్యశాలలోనే చేయాలని అదనపు డీఎంహెచ్ఓ సైదులు స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని సత్యనారాయణపురం, చర్ల (కొయ్యూరు) ప్రభుత్వ వైద్యశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్యశాలలకు వైద్యం కోసం వచ్చే రోగులకు అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్ ల్యాబులకు రిఫర్ చేయొద్దని సూచించారు. వర్షాకాలం సీజన్ ముగుస్తున్నప్పటికీ సీజనల్ వ్యాధులు ప్రబలుతూనే ఉన్నందున అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని చెప్పారు. అనంతరం మండలంలోని పలు ప్రైవేట్ వైద్యశాలలు, రక్త పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రైవేట్ వైద్యశాలల్లో స్థాయికి మించి వైద్యం చేయొద్దని, ప్రతీ రక్త పరీక్ష కేంద్రం వద్ద ఫీజుల వివరాలు పొందుపర్చాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ల్యాబ్‌లు, ఆస్పత్రులను సీజ్ చేశారు. మరికొన్నింటికి నోటీసులు జారీ చేశారు. ఆయన వెంట డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నగేశ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉన్నారు.

ప్రేమ పేరుతో నయవంచన

యువకుడిపై కేసు

గుండాల: ఓ యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని చెప్పి, గర్భవతిని చేసి, అనంతరం గర్భవిచ్ఛిత్తి చేయించిన యువకుడిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆళ్లపల్లి మండలంలో వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సోమేశ్వర్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సంగ్యాతండాకు చెందిన గుగులోత్ రాంబాబుకు.. ఆళ్లపల్లి మండలానికి చెందిన గిరిజన యువతికి 2020 నుంచి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. రాంబాబు సదరు యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి 2021లో గర్భవతిని చేశాడు. తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా మాత్రల ద్వారా గర్భవిచ్ఛిత్తి చేయించాడు. తర్వాత పెళ్లి చేసుకోనని యువతికి దూరంగా ఉంటున్నాడు. ఇప్పటివరకు తన నుంచి సుమారు రూ.5 లక్షల తీసుకున్నాడని, దుబాయ్ వెళ్లి వచ్చి పెళ్లి చేసుకుంటానని చెప్పాడని, పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా ఫలితం లేదని, యువకుడి ఇంటికి వెళ్లి నిలదీశానని, తల్లిదండ్రుల ముందే కొట్టి బయటకు గెంటేశాడని బాధిత యువతి తెలిపింది. బాధితురాలు ఆళ్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు. కాగా, రాంబాబు పరారీలో ఉన్నాడని ఆయన చెప్పారు.

జామాయిల్ చెట్ల నరికివేత



జామాయిల్ చెట్ల మొదళ్ల కొలతలు తీసుకుంటున్న డీఆర్ఓ నసూర్‌భీ

జూలూరుపాడు: జూలూరుపాడు మండలం గుండెపుడి అటవీ బీట్‌లోని ప్లాంటేషన్‌లో ఉన్న జామాయిల్ చెట్లను ఓ వ్యక్తి అక్రమంగా నరికిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. డీఆర్ఓ నసూర్‌భీ కథనం ప్రకారం.. గుండెపుడి అటవీ బీట్ 88 కంపార్ట్‌మెంట్ ప్లాంటేషన్‌లోని జామాయిల్ చెట్లను నరికి ఓ రైతుకు చెందిన పామాయిల్ తోటలో డంప్ చేసినట్లు సమాచారం తెలియడంతో గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం ప్లాంటేషన్‌లో నరికిన జామాయిల్ చెట్ల మొదళ్లను పరిశీలించి, నంబర్లు వేశామన్నారు. అనంతారం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఇందిరమ్మ ఇంటి స్లాబ్ కోసం ప్లాంటేషన్‌లోని జామాయిల్ చెట్లు నరికినట్లు తెలిసిందని, సుమారు 84 జామాయిల్ చెట్లు నరికి పామాయిల్ తోటలో దాచాడని, కర్రలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ అంచనా వేసి సంబంధిత వ్యక్తికి జరిమానా విధిస్తామని డీఆర్ఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు నరసింహారావు, చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫారెస్ట్ ఉద్యోగులపై గొత్తికోయ కుటుంబం దాడి

పోడు భూమిలో వరికోత వివాదం



గాయపడిన అధికారులు

కరకగూడెం: అటవీశాఖ ఉద్యోగులపై ఓ గొత్తికోయ కుటుంబం వేట కొడవళ్లతో దాడికి పాల్పడింది. పోడు భూమిలో యంత్రాలతో వరి కోస్తుంటే అడ్డుకోవడంతో ఈ దాడి జరిగింది. కరకగూడెం ఎస్‌ఐ పీవీఎన్ రావు కథనం ప్రకారం.. మండలంలోని అశ్వాపురంపాడు గ్రామ పోడు భూమిలో వజ్జ భీమరాజు, ఆయన భార్య గంగమ్మ, కుమారుడు అజయ్‌తో కలిసి శుక్రవారం హార్వెస్టర్‌తో వరి కోయిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంకటాపురం బీట్ ఆఫీసర్ కోటేశ్ అక్కడకు వెళ్లి పోడు భూముల్లో యంత్రాలు వినియోగించొద్దని సూచిస్తుండగా భీమరాజు కుటుంబంతో వాగ్వాదం జరిగింది. ఆపై ఆగ్రహానికి గురైన భీమరాజు కుటుంబీకులు వేట కొడవళ్లతో కోటేశ్‌పై దాడి చేశారు. ఆయన ఇచ్చిన సమాచారంతో సెక్షన్ ఆఫీసర్ గోవింద్ చేరుకోగా ఆయనపైనా దాడి చేయడంతో కంటి వద్ద, ఎడమ చేతి వేలికి తీవ్ర గాయమైంది. అదే సమయానికి చేరుకున్న గ్రామస్తులు గొడవను అడ్డుకోగా అటవీ ఉద్యోగులు కరకగూడెం పీహెచ్‌సీలో చికిత్స చేయించుకున్నారు. ఆ తర్వాత వారి ఫిర్యాదుతో భీమరాజు, గంగమ్మ, అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనమైన కుటుంబ వ్యాపార నేపథ్యం
ఉన్నంత మాత్రాన...
'విజయం అనివార్యం' అని చెప్పడానికి లేదు.
అంకితభావం, కష్టం ఉంటేనే
విజయం సొంతం అవుతుంది.
ఘనమైన కుటుంబ వ్యాపారనేపథ్యం
లేనంత మాత్రాన...
'విజయం దూరం' అని చెప్పడానికి లేదు.
ఆసక్తికి అంకితభావం, కష్టం తోడైతే
విజయం సొంతం అవుతుంది.
దీనికి తాజా ఉదాహరణ... అవెండస్
వెల్త్-హురున్ ఇండియా-2025 జాబితా.
35 ఏళ్ల లోపు ప్రతిభావంతులైన 155 మంది
యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు వెల్త్-హురున్
ఇండియా జాబితాలో చోటు సాధించారు.
వీరిలో...
వారసత్వ బాధ్యతకు తమ శక్తియుక్తులను
జోడించి తమదైన గుర్తింపు తెచ్చుకున్నవారు
ఉన్నారు. కొన్ని ఉత్పత్తులలో లోపాలు కనిపెట్టి
లోపాలు లేని, సౌకర్యవంతమైన ప్రాడక్ట్స్ కోసం
ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారి విజయం సాధించిన
వారూ ఉన్నారు... వారిలో కొందరు యంగ్
ఫిమేల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి..

యువ హవా


అవంతిక సరాగి

దేశంలో తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్

చెరకు, బయోప్లాస్టిక్‌కు సంబంధించిన ఆపరేషన్‌లలో యువ మార్గదర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది అవంతిక సరాగి. కాలిఫోర్నియాలో చదువుకున్న అవంతిక తమ బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్ లిమిటెడ్ (బీసీఎంఎల్)ను పీఎల్‌ఏ (పాలీలాక్టిక్ యాసిడ్) తయారీ సౌకర్యాన్ని అందించే కంపెనీగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో ఉంది. ఇది మన దేశంలోని మొట్ట మొదటి బయోప్లాస్టిక్ ప్లాంట్ కానుంది.

పీఎల్‌ఏ అనేది చెరకు పునరుత్పాదక వనరుల నుండి తయారైన బయో ఆధారిత, కంపోస్టబుల్, తక్కువ ఉద్గారాల ప్లాస్టిక్. దీనిని సాధారణంగా ప్యాకేజింగ్, త్రీడి ప్రింటింగ్‌లో ఉపయోగిస్తారు.

మన దేశంలోని ఈ తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్ వల్ల బీసీఎంఎల్ లాభాల బాటలో పయనించనుంది. టర్నోవర్ పెరగనుంది. పర్యావరణ అనుకూలంగా కూడా మారనుంది.

తరగతి గదిని మార్చేలా


పరిత పరేఖ్

వినూత్నమైన ఆలోచన విధానంతో విద్యా, సాంకేతిక రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ పరిత పరేఖ్. బ్రౌన్ యూనివర్శిటీలో చదువుకుంది. బ్రౌన్ తరువాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో 'ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్'పై మాస్టర్స్ చేసింది. స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకునే రోజుల్లో పిల్లల విద్యావిధానం మీద దృష్టి పెట్టేది. స్టాన్‌ఫోర్డ్‌లో చేసిన పరిశోధనలు, నేర్చుకున్న ఆధునిక సాంకేతిక విషయాలు ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించాయి.

కటింగ్-ఎడ్జ్ ఎడ్యుకేషనల్ టెక్ ప్లాట్‌ఫామ్ 'టొడెల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించింది పరిత. మూస బోధన పద్ధతులకు అతీతంగా ఆధునిక బోధన పద్ధతులు, ఆలోచనలతో 'టొడెల్' ప్లాట్‌ఫామ్‌కు రూపకల్పన చేసింది. 'టొడెల్' ప్రభావంతో చాలా బడులలో ఉపాధ్యాయుల బోధన పద్ధతి మారింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంప్రదాయ, ఆధునిక విద్యాబోధనలో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి 'టొడెల్' కృషి చేస్తోంది.

విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించే ప్రణాళికలతో 'టొడెల్' విద్యాప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సాధించింది.


మీనూ మార్గరెట్

సక్సెస్‌ఫుల్ యూఎస్పీతో...

ప్రారంభ కష్టాల మాట ఎలా ఉన్నా... ఉమెన్ యాక్టివేర్ 'బ్లిస్‌క్లబ్' మార్కెట్‌లో నిలుదొక్కుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఈ ఆన్‌లైన్ బ్రాండ్ ఆ తరువాత రెండు ఆఫ్‌లైన్ స్టోర్‌లను కూడా లాంచ్ చేసి విజయం సాధించింది. 'మార్కెట్‌లో ఎన్నో బ్రాండ్‌లు ఉన్నాయి కదా. మీ ప్రత్యేకత ఏమిటి?' అనే ప్రశ్న 'బ్లిస్‌క్లబ్' ఫౌండర్, సీయీవో మినూ మార్గరెట్ ముందు వచ్చి నిల్చుంది. సిగ్నేచర్ ఫ్యాబ్రిక్స్, వినూత్నమైన ప్రాడక్ట్ డిజైన్‌ను తమ కంపెనీ యూఎస్పీగా చేసుకొని విజయం సాధించింది మార్గరెట్.

నేషనల్ లెవెల్ ఫ్రిస్బీ ప్లేయర్ అయిన మినూ మార్గరెట్ యాక్టివేర్‌కు సంబంధించిన డీసెంట్ ఆప్షన్స్ గురించి ఆలోచిస్తున్నప్పుడు 'బ్లిస్‌క్లబ్' స్టార్టప్ ఆలోచనవచ్చింది.

'యాక్టివేర్ రంగంలోని కంపెనీలు డిజైన్ ఫస్ట్ విధానాన్ని అనుసరిస్తాయి. మేము మాత్రం ఈ విధానానికి దూరంగా ఉన్నాం. బ్లిస్‌క్లబ్‌కు డిజైన్ క్లబ్ లేదు. ప్రాడక్ట్ ఇంజినీరింగ్ టీమ్ మాత్రమే ఉంది. ఈ టీమ్ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం యాక్టివేర్ సౌలభ్యానికి సంబంధించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడం. ఉదాహరణకు చెన్నైలోని ఒక మహిళ గురించి. వేడి వాతావరణంలో ఆమెకు లెగ్గింగ్స్ ధరించడం కష్టమయ్యేది. ఇలాంటి సమస్యను దృష్టిలో పెట్టుకొని వేడివాతావరణంలో కూడా సౌకర్యంగా ఉండే లెగ్గింగ్స్‌ను డిజైన్ చేశాం' అంటుంది మార్గరెట్.


నీతూ యాదవ్ - కీర్తి జాంగ్రా

చిన్న గదిలో మొదలై... కోట్ల టర్నోవర్ వరకు

బెంగళూరులోని చిన్న గదిలో మొదలైన 'యానిమల్' రూ.550 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ స్థాయికి చేరింది. ఐఐటీ-ఢిల్లీలో చదువుకున్న కీర్తి జాంగ్రా, నీతూ యాదవ్‌ల బ్రెయిన్ చైల్డ్ 'యానిమల్'. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అవ్యవస్థీకృతంగా ఉన్న మన దేశంలోని పశువుల మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

పశువుల క్రయవిక్రయాలలో 'యానిమల్' యాప్ కీలక పాత్ర పోషిస్తోంది. తమ స్టార్టప్‌ను ప్రారంభించడానికి ముందు సర్వే నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు కీర్తి, నీతూ యాదవ్. డైరీ ఇండస్ట్రీలో కీలకమైన మార్పు తేవాలనుకున్న కీర్తి, నీతూ యాదవ్‌లు 'యానిమల్' యాప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా మనం ఉన్న చోటు నుంచే వందల కిలోమీటర్‌ల దూరంలో పశువుల క్రయ విక్రయాలు జరుగుతున్న ప్రదేశం తదితర వివరాలు తెలుసుకోవచ్చు.



దీపావళి వెనుక ఉన్న పురాణాలు

పిల్లలూ... మీకు ఇష్టమైన పండుగలలో దీపావళి ముందు వరుసలో ఉంటుంది కదూ. దీపాలు వెలిగించడం, టపాసులు పేల్చడం, పిండివంటలను ఆరగించడం... భలే సరదా. అయితే అసలు దీపావళి పండుగ ఎందుకు జరుపుకుంటాం, ఈ వేడుక వెనకున్న కథలేంటి తెలుసుకుందాం.

నేటి 'సాక్షి ప్లస్' కిడ్స్ ఈపేపర్‌లో

వంటిల్లు

తియ్యటి వేడుక

ముచ్చటగా అలంకరించిన లోగిళ్లు
అందంగా ముస్తాబైన చిన్నా పెద్దలు
ఓ వైపు దీప కాంతులు
మరోవైపు బాణాసంచా పేలుళ్లు
ఆనందాలు విప్పారుతుండగా
తియ్యని రుచులు నోరారా ఆస్వాదిస్తుంటే
వేడుకంతా నట్టింట్లో కొలువుదీరినట్టే ఉంటుంది.
రెట్టింపు ఆనందాలను పంచడానికి
వంటిల్లు తీపి వంటకాలను
సిద్ధం చేస్తూనే ఉంటుంది.
ఎక్కువ శ్రమ లేకుండా పండగవేళ
తియ్యని రుచులను సులువుగా చేసేద్దాం.
ఇంటిల్లిపాదికి ఆనందాన్ని పంచేద్దాం..



గులాబ్ జామూన్

కావలసినవి: రెడీమేడ్ జామూన్ మిక్స్ – కప్పు; నీళ్లు/పాలు – అవసరమైనంత (జామూన్ మిక్స్ కలపడానికి); పంచదార – ఒకటింపావు కప్పులు; నీళ్లు – కప్పు; యాలకుల పొడి – చిటికెడు.

తయారీ: ● పంచదార, నీళ్లు కలిపి, మరిగించి సిరప్ తయారు చేయాలి. దాంట్లో చిటికెడు యాలకుల పొడి కలపాలి ● జామూన్ మిక్స్‌కి కొంచెం నీళ్లు లేదా పాలు జోడించి మృదువుగా కలపాలి ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, ఉండలు చేయాలి ● బాణలిలో నూనె పోసి వేడయ్యాక, సిద్ధంగా ఉంచుకున్న ఉండలు వేసి, వాటిని గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి ● వేయించిన జామూన్లను వేడి సిరప్‌లో వేసి, రెండు గంటలు నాననివ్వాలి.



సూజీ హల్వా

కావలసినవి: సూజీ (బొంబాయి రవ్వ) – కప్పు; నీళ్లు – 2 కప్పులు; పంచదార – కప్పు; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; జీడిపప్పు, కిస్‌మిస్ – అవసరమైనంత.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడిపప్పు, ద్రాక్ష వేయించాలి. ● వాటిని తీసి, అదే నెయ్యిలో సూజీ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● మరో పాత్రలో నీరు మరిగించి, రవ్వ పోస్తూ, కలపాలి. ● రవ్వ ఉడికిన తర్వాత పంచదార కలిపి తర్వాత యాలకుల పొడి వేసి కలపాలి. ● చివరగా వేయించిన కాజూ, ద్రాక్ష వేసి మిక్స్ చేయాలి.



రైస్ పుడ్డింగ్ / పాయసం

కావలసినవి: బియ్యం – పావు కప్పు; పాలు – 3 కప్పులు; పంచదార – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; యాలకులు, కిస్‌మిస్ – అవసరమైనంత; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● బియ్యం కడిగి, కొద్దిగా ఉడికాక పాలు పోసి, మెల్లిగా మరిగించాలి. ● బియ్యం పూర్తిగా ఉడికాక పంచదార కలపాలి. ● యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి.



బేసిన్ లడ్డూ

కావలసినవి: బేసన్ (సెనగపిండి) – కప్పు; నెయ్యి – పావు కప్పు; పంచదార పొడి – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్.

తయారీ: ● పాన్‌లో నెయ్యి వేసి, వేడి చేయాలి. మంట బాగా తగ్గించి, దాంట్లో శనగపిండి వేసి, మెల్లగా బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● చల్లారిన తర్వాత పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి. ● మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, చేతులతో లడ్డూలు చేయాలి.



వామ్మో.. ఏ(ఐ)డడుగులు..!

మన పురాతన తాటాకు శాసనాల గ్రంథాల్లో అన్నీ ఉన్నాయో లేవోగానీ... మన సినిమాల్లో మాత్రం సకల విజ్ఞాన శాస్త్రాలూ ఉన్నాయి. అందుకు నిదర్శనమే మనదైన పానిండియన్ సూపర్‌హిట్ బ్లాక్‌బస్టర్ సినిమా 'రోబో'!

ఏ అద్భుత ముహూర్తాన మన డైరెక్టర్ శంకర్ 'రోబో' తీశాడోగానీ... లోకమంతటా అవే వింతలు అచ్చం అలాగే జరుగుతున్నాయి. ఉదాహరణకు...

ఇక్కడి మన సినిమాలో హ్యూమనాయిడ్ రోబో కాస్తా మానవ మానస వికాసాలూ, వికారాలూ ఒంటబట్టించుకుని 'రోబో సేపియన్' అవుతాడా! అలా అవ్వగానే ఆ 'టాయ్'ఫ్రెండు కాస్తా హీరోయిన్‌కి 'బాయ్'ఫ్రెండుగా మారి... అచ్చం మన మానవ కుర్రాళ్లలాగే... తనను ప్రేమించని అమ్మాయి మీద యాసిడ్లూ గట్రా విసిరేంత క్రూరమైన 'సెల్ఫ్‌స్టైల్డ్ లవర్‌బా(టా)య్'గా మారిపోతాడు కదా.

అక్కడ అమెరికాలోని ఒహాయో రాష్ట్ర చట్టనిపుణులు బహుశా 'రోబో' సినిమా చూసి హడలిపోయి ఉంటారేమో... మానవ మేధకూ, కృత్రిమ మేధస్సుకూ మధ్య వివాహాలు వద్దంటే వద్దంటూ గొడవ గొడవ చేస్తున్నారు. అంతేనా... ఆ మేరకు ఓ చట్టం తీసుకువచ్చేందుకు బిల్లు కూడా ప్రిపేర్ చేశారు.

అదే డైరెక్టర్ శంకర్‌గారి ఆయొక్క అదే 'రోబో' సినిమాలో... ''ఇనుములో ఓ హృదయం మొలిచెనే'' పాటనుంచి స్ఫూర్తి పొందినట్టుగా... ఇప్పటికే మన పొరుగు దుండగీడైన చైనావాడు 'దివిరి ఇసుకన తైలంబు' రీతిగా దివిరి ఇనుమున గర్భసంచి నుంచి చిన్నారి పాపలను రేపీపాటికి తీసిస్తానంటూ తొడలుగొడుతూ, హడలగొడుతున్నారన్న సంగతి తెలిసిందే. అంతే కాదు... రోబోలకు సీమంతాలవీ గట్రా చేసేసి కృత్రిమ 'ఊంబ్'ల లోంచి ఉంగా ఉంగా పాపాయిలను పుట్టిస్తానంటూ సవాళ్లు విసురుతున్నారు కూడా.

అమిత వింతలకు నెలవైన అమెరికాలో... ఈ చిత్ర విచిత్రాలన్నీ చూస్తున్న ఒహాయో రాష్ట్రపు మేధావులు భయపడిపోతున్నారేమో... ఆ ఆందోళనతో స్థిమితంగా ఉండలేక... బహ్మాండమైన ఓ వివాహ నిషేధ చట్టాన్ని తెచ్చేందుకు నిశ్చయించుకున్నారు. ఆ మేరకు బిక్కు బిక్కుమంటూ బిల్లొకదాన్ని అక్కడి చట్టసభల్లో ప్రవేశపెట్టబోతున్నారు కూడా! దీనికి కారణమేంటంటే... అక్కడి కుర్రకారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెళ్లిళ్లు చేసుకునేందుకు తెగ ఉత్సాహపడిపోతున్నారట!

హాయ్యో...! ఇప్పటికే అతి మేధావులైన మానవులూ, అమితమైన మేధస్సుల 'కృత్రిమ మేధ' మధ్య పెళ్లిళ్లు జరిగితే... రేపు సదరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కాస్తా పవరాఫ్ ఆటార్నీలంటూ పవర్‌పట్టా తీసుకోవడం, పార్ట్‌నర్‌తో చెట్టాపట్టాలే కాకుండా, లీగల్ వ్యవహారాల్లోకి దూరి, అసలు నిపుణులు తట్టాబుట్టా సర్దుకునేలా, చెట్టూపుట్టా పట్టుకుపోయేలా, బెదిరీ చెదిరీ పోయేలా చేస్తాయేమోనని హడలెత్తుతున్నారు 'ఒహాయో రాష్ట్ర'పు చట్ట నిపుణులు.

అందుకే... మనుషులకూ, యంత్రాలకు మధ్య పెళ్లి మంత్రాలు వద్దంటే వద్దంటూ పట్టుపడుతున్నారు. మానవులూ, యాంత్రాల మధ్య మనువులు వద్దంటూ వాదిస్తున్నారు. ఇది 'యంత్రమాత్రమూ' తగదంటూ బల్లగుద్ది మరీ శాసిస్తున్నారు మన ఒహాయో స్టేట్ రిప్రజెంటేటివ్, రిపబ్లికన్ మెంబరూ అయిన మిస్టర్ 'థాయిడస్ క్లాగెట్' గారు!

అలనాడెప్పుడో బ్రహ్మంగారు చెప్పిన వింతలన్నీ అక్కడా ఇక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడీ నేపథ్యంలో ఈ పుట్టు తెలివితేటలున్న మన మానవాళీ... పెట్టు తెలివితేటలున్న రోబోయంత్రాళీ... కలగలిసి సంకరమైతే... రేపు భవిష్యత్తులో సకల 'అతి'తెలివితేటలున్న బుజ్జిబుజ్జి రోబో-కంగాళీలకు ఆస్కారముంటుందేమోనని అనుమానిస్తున్నారు.

అచ్చం రోబో సినిమాలోలాగే... రేపెప్పుడైనా పొరబాటున ఆ 'చిట్టి' చిట్టి రోబోలకు విలనీయులైన ఏ అడ్డమైన సైంటిస్టులో 'రెడ్డు చిప్పు' పెడితే... అప్పుడది మన మానవాళి చేతికి 'డేంజరు చిప్పే'ననేమోనంటూ ఇన్నిరకాల ఆంక్షలూ, హాహాకారాలంటూ లోకంలోని ప్రజలంతా తెగ చెవులు కొరుక్కుంటున్నారన్నది అభిజ్ఞ వర్గాల అతి రహస్య భోగట్టా.

– యాసీన్

ఏఐ మ్యారేజ్ ప్రపోజల్



ప్రేమలేఖల నుంచి ఎస్‌ఎంఎస్‌ల వరకు లవ్, మ్యారేజ్ ప్రపోజల్స్ పలు రకాలు. తాజా విషయానికి వస్తే...ఒక కుర్రాడు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ను ఉపయోగించి ఫేక్ డిస్నీ-స్టైల్ ట్రైలర్ ద్వారా తన స్నేహితురాలికి మ్యారేజ్ ప్రపోజ్ చేశాడు. ఈ వీడియోకు 11 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి. ఈ వీడియోను ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీషేర్ చేస్తున్నారు. 'ది ఈజీయెస్ట్ యస్. యస్, ప్రపోజ్‌డ్ టు జె... యూజింగ్ ఏఐ' అని వీడియోకు కాప్షన్ ఇచ్చారు. వీడియో చివరలో 'విల్ యూ మ్యారీ మీ' అనే కామెంట్ కనిపిస్తుంది. ఇంతకీ ఆ అమ్మాయి 'యస్' చెప్పిందా? యస్! 'ది మోస్ట్ బ్యూటీఫుల్ మ్యారేజ్ ప్రపోజల్' అంటూ స్పందించారు నెటిజనులు.

ధన త్రయోదశి

ఆరోగ్యమస్తు ధనప్రాప్తిరస్తు



నేడు ధనత్రయోదశి. సాధారణంగా ధన త్రయోదశి అనగానే బంగారం, వెండి, ఇతర గృహోపకరణాలు కొనడం అందరూ చేసేదే. అయితే ధనత్రయోదశి ప్రాశస్త్యాన్ని తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ఆ కథ తెలుసుకుందాం.

దేవతలు, దానవులు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలుకుతున్న సమయంలో ఆ క్షీరసాగరం నుంచి శ్రీ మహాలక్ష్మి జన్మించింది. అంతే కాదు సంపదలను ప్రసాదించే కల్పవృక్షం, కామధేనువు, దేవవైద్యుడు ధన్వంతరి కూడా శ్రీ మహాలక్ష్మితో పాటే జన్మించారు. ఆ రోజు ఆశ్వయుజ బహుళ త్రయోదశి. శ్రీమహాలక్ష్మి ..., ధనానికి ప్రతిరూపం. అందుకే., ఆమె జన్మదినమైన ఈ ఆశ్వయుజ కృష్ణ త్రయోదశిని.. 'ధన త్రయోదశి' అన్నారు.

ఎంత చదువు చదివినా..,, ఎన్ని తెలివితేటలు ఉన్నా., శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లేకపోతే జీవితం గడపడం కష్టం. అందుకే.. సర్వ సంపత్ప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం సర్వ మానవాళి ఈ రోజున శ్రీమహాలక్ష్మిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, ఆమె ఆశీస్సులు అందుకుంటారు.

ధనానికి అధిదేవత 'శ్రీమహాలక్ష్మి. ధనానికి అధినాయకుడు ఉత్తర దిక్పాలకుడైన 'కుబేరుడు'. అందుకే ఈ ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మితోపాటు కుబేరుని కూడా ఆరాధిస్తారు. సాధారణంగా ఈ లక్ష్మీ పూజను సాయం సమయంలో ప్రదోష వేళలో చేసుకుంటే చాలా మంచిది.

లక్ష్మీ కుబేర వ్రతం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, వ్యాపార అభివృద్ధి అదే విధంగా నూతన వ్యాపారం ప్రారంభించబోయే వారు, ఉద్యోగ అభివృద్ధి కోరుకుంటున్నవారు, అప్పుల బాధలు ఉన్నవారు లక్ష్మీ కుబేర వ్రతాన్ని చేసుకోవడం వల్ల ఆయా బాధల నుంచి విముక్తి పొంది, అన్నింటా అభివృద్ధి జరుగుతుందని పెద్దలు చెబుతారు కాబట్టి ఈ వ్రతాన్ని చేయాలనుకుంటున్న వారు అక్షయ తృతీయ రోజు, ధన త్రయోదశి రోజు, కార్తీక శుక్ల పంచమి రోజు లేదా తొమ్మిది గురువారాలు లేక శుక్రవారాలు చేసుకోవచ్చు.

ధన్వంతరి జయంతి

దేవవైద్యుడు, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అంశావతారమైన ధన్వంతరి పాలసముద్రం నుంచి ఆవిర్భవించింది కూడా ధనత్రయోదశి నాడే. అందుకే ఈ పర్వదినాన చాలామంది ధన్వంతరిని కూడా పూజిస్తారు. ముఖ్యంగా ఆరోగ్యం బాగలేని వారు, ఆయుర్వేద వైద్య విధానం మీద నమ్మకం ఉన్న వారు శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన ధన్వంతరిని పూజించడం వల్ల ఆరోగ్యవంతులవుతారని చెబుతారు. ధన్వంతరి చేతిలో శంఖు చక్రాలతోపాటు ఔషధ భాండం లేదా అమృత కలశం, జలగ ఉంటాయి. జలగ శరీరంలో చేరిన చెడు రక్తాన్ని పీల్చివేసి ఆరోగ్యాన్నిస్తుందని ప్రతీతి. అందుకే ధన్వంతరి చేతిలో జలూకం అంటే జలగ ఉంటుంది.

నేడు శని త్రయోదశి కూడా. ధనత్రయోదశి నాడే శని త్రయోదశి కూడా రావడం చాలా విశేషం. అందువల్ల ఈ వేళ పాత వస్తువులు, పాత ఆలోచనలు, పాతదనాన్ని వదిలించుకుని, కొత్త వస్తువులు కొనుగోలు చేయటం, కొత్త ఆలోచనలు చేయటం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం చాలా మంచిది.

పితృదేవతాపూజకు కూడా ధనత్రయోదశి చాలా ప్రశస్తమైనది. ధనత్రయోదశి నాడు ఇంటిలో దీపాలు వెలిగించి, మన పెద్దవారిని తలచుకోవడం వల్ల వారి ఆశీర్వాదంతో శుభం చేకూరుతుందని పండితులు చెబుతారు. ఈ శుభవేళ అందరికీ కీడు తొలగి మేలు చేకూరాలని కాంక్షిద్దాం.

– డి.వి.ఆర్.

బులియన్

(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
అక్టోబర్ 17న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,34,990	1,24,590	1,90,000
విజయవాడ	1,35,150	1,21,700	1,81,000
విశాఖపట్నం	1,32,770	1,21,700	2,03,000
రాజమండ్రి	1,35,150	1,25,350	1,81,000
ప్రొద్దుటూరు	1,32,500	1,21,900	1,81,000
చెన్నై	1,33,090	1,22,000	2,03,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.